VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

శనివారం 06 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.244


## తిహాడ్ జైలులో కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి అనుమతి

**దిల్లీ మద్యం విధానం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.**



దిల్లీ: దిల్లీ మద్యం విధానం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించేందుకు అనుమతి కోరుతూ దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు న్యాయస్థానం సమ్మతించింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా కవిత తిహాడ్ జైలులో ఉన్నందున ఆమెను ప్రశ్నించే ఒక రోజు ముందు జైలు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుళ్లు ఉండాలని షరతు విధించింది. అలాగే, విచారణలో అన్ని నిబంధనలు పాటించాలని సూచించింది. ఈ కేసుకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని కవిత నివాసంలోనే సీబీఐ అధికారులు ఆమెను మూడు రోజుల పాటు విచారించిన విషయం తెలిసిందే.

కోర్టు అనుమతి రావడంతో వచ్చే వారమే సీబీఐ అధికారులు కవితను ప్రశ్నించేందుకు అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో తాము నమోదు చేసిన వాంగ్మూలం, అప్రూవర్‌గా మారినవాళ్లు, ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆమెను ప్రశ్నించేందుకు సీబీఐ సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. కవితను ప్రశ్నించి కొంత సమాచారం రాబట్టిన తర్వాత సీబీఐ ఈ కేసులో మరో ఛార్జిషీటు దాఖలు చేసే అవకాశం ఉంది.

దిల్లీ మద్యం కేసులో ముడుపులు చేతులు మారాయని, మద్యం విధానం రూపొందించిన ప్రైవేటు వ్యక్తులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించారన్న ఆరోపణలపై కేంద్ర హోంశాఖ ఆదేశాలతో సీబీఐ తొలుత కేసు నమోదు చేసింది. ఇప్పటికే కవితను సీబీఐ విచారించగా.. గత నెల 15న ఈడీ అధికారులు ఆమెను అరెస్టు చేశారు. పది రోజుల పాటు కస్టడీకి తీసుకొని ప్రశ్నించారు. విచారణ ముగియడంతో ప్రస్తుతం ఆమె జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా మరోసారి కవితను ప్రశ్నించేందుకు ప్రత్యేక పిటిషన్ వేసి అనుమతి తీసుకోవడం గమనార్హం.



**నేడు తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర సభ**

**మ్యానిఫెస్టో తెలుగుప్రతిని విడుదల చేయనున్న రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి**

**10 లక్షల మంది వస్తారని ఏర్పాట్లు**

# తెలంగాణ నుంచే ప్రచారభేరి..!

**దిల్లీ గద్దెపై జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సభలో ఎన్నికల సమరశంఖాన్ని పూరించనుంది.**

హైదరాబాద్: దిల్లీ గద్దెపై జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సభలో ఎన్నికల సమరశంఖాన్ని పూరించనుంది. జాతీయ ఎన్నికల ప్రచారానికి తొలిమెట్టుగా 'జనజాతర' పేరుతో భారీ బహిరంగసభను నిర్వహించేందుకు పార్టీ సర్వం సిద్ధం చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు ఈ సభకు హాజరుకానున్నారు. శుక్రవారం పార్టీ జాతీయ మ్యానిఫెస్టోను దిల్లీలో సోనియా, ఖర్గే, రాహుల్‌గాంధీలు విడుదల చేశారు. దీని తెలుగు ప్రతిని శనివారం జరిగే జనజాతర సభలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో నెగ్గి కేంద్రంలో అధికారంలోకి రావడానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు అత్యంత ముఖ్యమని కాంగ్రెస్ భావిస్తోంది. పార్టీ అత్యధిక లోక్‌సభ స్థానాలు నెగ్గే రాష్ట్రాల్లో ఇవి రెండూ ముందుంటాయని కాంగ్రెస్ నేతల అంచనా. తెలంగాణలో మొత్తం 17లో 14 లోక్‌సభ స్థానాలు గెలుచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నందునే జాతీయ ప్రచార సమరశంఖాన్ని హైదరాబాద్ నుంచే పూరించాలని నిర్ణయించింది. రాహుల్‌గాంధీ సభతో ప్రచారాన్ని ప్రారంభిస్తే రాష్ట్రంలో కూడా పార్టీశ్రేణుల్లో ఉత్సాహం వస్తుందని నాయకుల అంచనా. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'విజయభేరి' పేరుతో ఇదే తుక్కుగూడలో సభను నిర్వహించారు. అక్కడ ఆరు గ్యారంటీ



హామీలు ప్రకటించడంతో ఎన్నికల్లో పార్టీకి సానుకూలత ఏర్పడిందనే సెంటిమెంటుతో లోక్‌సభ ఎన్నికలకు కూడా ఇదే వేదికను ఎంచుకున్నారు.


**ఎండవేడితో జాగ్రత్తలు**

రాష్ట్రం నలుమూలల నుంచి 10 లక్షల మందికి పైగా ప్రజలు దీనికి తరలి వస్తారని చెబుతున్న పార్టీ.. ఆ మేరకు పెద్దయెత్తున ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి పోలింగ్ బూత్ పరిధి నుంచి కనీసం పదిమంది పార్టీ కార్యకర్తలు ఈ సభకు తరలివచ్చేలా వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. నల్గొండ, భువనగిరి, చేవెళ్ల, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల నుంచి అత్యధికంగా ప్రజలను తరలించాలని నిర్ణయించారు. మిగిలిన ప్రాంతాల నుంచి పోలింగ్ బూత్ స్థాయిలో వాహనాలను స్థానిక నేతలు సమకూరుస్తున్నారు. జనాన్ని తరలించే క్రమంలో వారికి దారి పొడవునా మంచినీరు, మజ్జిగ, భోజనాలను నేతలు సమకూరుస్తున్నారు. ఎండల వేడి అధికంగా ఉన్నందున సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా, అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ నాయకులకు సూచనలు అందాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే జనం సభ ముగిసిన తరువాత ఇంటికి చేరేవరకూ స్థానిక నేతలు జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ సూచించింది.

**సీఎం పర్యవేక్షణ..**

సభ ఏర్పాట్లను పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఆయన మూడుసార్లు సభాస్థలికి వెళ్లి అధికారులకు, నేతలకు పలు సూచనలిచ్చారు. శుక్రవారం కూడా పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఇతర ముఖ్యనేతలు తుక్కుగూడలో ఏర్పాట్లను సమీక్షించారు. అగ్రనేతలు వస్తుండటంతో పాటు, తెలంగాణ వేదికగా జాతీయ ప్రచారానికి సమరశంఖాన్ని పూరించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించినందున సభను విజయవంతం చేయాలని పార్టీ

రాష్ట్ర నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకూ నేతలందరూ జనసమీకరణలో పాలుపంచుకోవాలని పార్టీ సూచనలిచ్చింది. కాంగ్రెస్ విడుదల చేసిన జాతీయ మ్యానిఫెస్టోలో నిరుద్యోగులు, మహిళలు, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చినందున ఈ సభకు వారిని ఎక్కువగా తరలించాలని నిర్ణయించారు.



## యథాతథంగా ద్రవ్య పరపతి విధానం

**ముంబై:** భారతీయ రిజర్వ్ బ్యాంకు కీలక వడ్డీ రేట్లను ప్రకటించింది. ఏడవసారి కూడా రెపో రేటును మార్చలేదు. రెపో రేటును 6.5 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. రెపో రేటు యథాతథంగా ఉంచేందుకు ద్రవ్య పరపతి కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థికవృద్ధి గాడిలో పడిందన్నారు. అన్ని అంచనాలను దాటి వేస్తున్నామన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉందన్నారు. డిసెంబర్ 5.7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం రెండు నెలల్లోనే 5.1 శాతానికి తగ్గినట్లు ఆయన చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తీసుకువచ్చే పక్రియలు కొనసాగుతున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. జీడీపీ అంచనాల గురించి కూడా శక్తికాంత్ దాస్ కీలక ప్రకటన చేశారు. 2024-25 సంవత్సరానికి చెందిన జీడీపీ వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. రిస్క్‌లన్నీ ప్రస్తుతం సమతుల్యంగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరని కూన శ్రీశైలం గౌడ్

**కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ**



**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో పుంజుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ కీలక నేతలను పార్టీలోకి చేర్చుకోవడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరారు. కూన శ్రీశైలం గౌడ్‌కు దీపాదాస్ మున్షీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోకపోతే ఊరుకునేది లేదు



**కాంగ్రెస్ విధానాల వల్లే రాష్ట్రంలో రైతులు కష్టాలు అనుభవిస్తున్నారని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.**

**కరీంనగర్:** రైతులు ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు రైతన్నలకు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా రూరల్ మండలం ముగ్దుంపూర్‌లో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాలకు నీటి సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు గులాబీ దళపతి ముందు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందవుతుందని తెలిపారు. గత సంవత్సరం నీరు సంవృద్ధిగా ఉండేదని.. వరి కోత కోసేందుకు ఇబ్బందయ్యేదని పేర్కొన్నారు. ఇప్పుడు పొలమంతా ఎండిపోయింది.. ఒకసారి వాగులోకి నీళ్లిస్తే రైతులందరు బతుకుదురని చెప్పారు. మంచినీళ్లకు కూడా గోసవుతుందని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పోయిన సంవత్సరం మండుటెండల్లో కూడా చెక్‌డ్యామ్‌లు మత్తడి పోశాయని.. ఈ సంవత్సరం చుక్కా లేకుండా అడుగంటిపోయాయని మరో రైతు తెలిపారు. స్పందించిన కేసీఆర్ రైతులకు బీఆర్ఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. రైతులు ధైర్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. రైతులకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు.

# ఘనంగా "సిఎంఆర్" కళాశాల వార్షికోత్సవం.














## విజయమే "జీవిత లక్ష్యం" కావాలి.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపు.

**.వేగుచుక్క న్యూస్, మేడ్చల్, ఏప్రిల్ 5:**

విజయమే విద్యార్థుల "జీవిత లక్ష్యం" కావాలని, ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఎంఆర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలో ఏదీ సాధించాలన్న టెక్నాలజీ అవసరం ఉందన్నారు. ఇప్పుడు విద్యార్థులు కష్టపడి టెక్నాలజీ లో నైపుణ్యం సాధిస్తే జీవితంలో అనేక విజయాలు సాధించవచ్చు అని అన్నారు. అలుపెరుగకుండా ఒక దీక్ష తో చదివితే ప్రపంచాన్ని ఏలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రతి రోజూ సమయం వృధా చేయకుండా కష్టపడే తత్వం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







# ఐదు కాదు.. 25 గ్యారెంటీలు.




**న్యూఢిల్లీ:** ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాకర్షక మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చింది. అన్ని వర్గాలను అక్కున చేర్చుకుని ముందుకు సాగే లక్ష్యంతో ఆకర్శణీయమైన, ఆచరణసాధ్యమైన హామీలను పొందుపర్చిన మేనిఫెస్టోను ప్రకటించింది. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. 48 పేజీలతో కూడిన మ్యానిఫెస్టోను పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో కలిసి విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న రైతాంగానికి అవసరమయ్యే విధంగా పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి దానికి చట్ట భద్రత కల్పిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. ఎన్నో రోజులుగా ఊరిస్తూ వచ్చిన పార్టీ మొత్తానికి హామీలను ప్రకటించింది. పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీ పేరుతో ఈ మేనిఫెస్టోని విడుదల చేసింది. మొత్తం 25 హామీలు వెల్లడించింది. సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలు చేర్చింది. దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ప్రస్తుతం ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని హామీ ఇచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని తెలిపింది. వ్యవసాయ పరికరాలకు జీఎస్‌టీ మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చింది. రైల్వేల ప్రైవేటీకరణను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. యువతకు 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించింది. అగ్నివీర్ స్కీమ్‌ని రద్దు చేస్తామని తెలిపింది. మహాలక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష నగదు అందిస్తామని హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారెంటీ కూడా ఈ హామీల జాబితాలో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని మరో ఆసక్తికర హామీని చేర్చింది. యువకులు, మహిళలతో పాటు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఈ మేనిఫెస్టోని రూపొందించింది కాంగ్రెస్. అన్ని వర్గాలకూ సమన్యాయం జరిగేలా చూస్తామన్న సంకేతమిచ్చేలా పాంచ్ న్యాయ్ పేరిట ఈ హామీలను తయారు చేసింది. యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ పేరిట వీటిని ప్రకటించింది. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ డేటా ఆధారంగా ఆయా వర్గాల సంక్షేమానికి సహకరిస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ఇప్పటి వరకూ ఉన్న 50 శాతం పరిమితి తొలగిస్తామని స్పష్టం చేసింది. దీంతో షెడ్యూల్ తెగలు,షెడ్యూల్ కులాలకు మేలు జరుగుతుందని వివరించింది. కులగణన తరవాత ఈ 50 శాతం పరిమితిని తొలగించేలా రాజ్యాంగంలో సవరణలు చేస్తామని తెలిపింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకి చెందిన వాళ్లకి విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెల్లడించింది. . ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేయడాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ఎలక్టోరల్ బాండ్స్‌పై విచారణతో పాటు పెగాసస్, రఫేల్ అంశాలపైనా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చింది. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని స్పష్టం

చేసింది. పాతపద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేస్తామని వెల్లడించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీని మినహాయిస్తామని హామీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ రద్దు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ. 4 వందలు ఇస్తామని హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలో సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలను పొందుపరిచారు. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమ సూత్రాలపై దీనిని రూపొందించినట్లు మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం వివరించారు. గత పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్నిరంగాల్లో విధ్వంసం జరిగిందని ఆయన అన్నారు. అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడారు. మా మేనిఫెస్టోను పేదలకు అంకితం చేస్తున్నాం. దేశ రాజకీయ చరిత్రలో న్యాయ పత్రాలుగా దీనిని ప్రజలు గుర్తుంచుకుంటారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో అందిస్తామన్న ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలు దీనిలో ఉన్నాయి. 'యువ న్యాయ్' కింద ప్రతి విద్యావంతుడికి అప్రంటీస్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తాం. దీని కోసం ఒక్కొక్కరిపై రూ.లక్ష వెచ్చిస్తాం. 'మహిళా న్యాయ్' కింద పేద ఇంటి ఆడవారికి ఏటా రూ.లక్ష సాయం చేస్తాం. 'కిసాన్ న్యాయ్' కింద రైతులకు రుణమాఫీ, ఎంఎస్‌పీ చట్టాలకు హామీ ఇస్తున్నాం. 'శ్రామిక్ న్యాయ్' కింద ఉపాధి హామీ పథకంలో కనీసం రూ.400 వేతనం ఇస్తాం. 'హిస్సేదార్ న్యాయ్'లో సామాజిక, ఆర్థిక సమానతల కోసం జాతీయ జనగణన చేపడతాం. ఇది ఎవరికీ వ్యతిరేకంగా కాదు. కేవలం ప్రజల స్థితిగతులపై అవగాహన కోసమే చేపడుతున్నాం. రాష్ట్రాలకు అందాల్సిన నిధులను ఇస్తాం. 'రక్షా న్యాయ్' కింద విదేశీ వ్యవహారాల్లో కూడా మార్పులు తీసుకొస్తాం. మేం చేయగలిగిన అంశాలనే మేనిఫెస్టోలో చేర్చామని అన్నారు. మోదీ హయాంలో ఒక్కటైనా పెద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇచ్చారా..?
కేవలం తిట్లు తప్పితే ఆయన పాలనలో మరేమీ వినలేదు. విపక్ష నేతలను జైళ్లలో పెడుతున్నారు. ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించడంలేదు. మా పార్టీపై రూ.3,500 కోట్ల జరిమానాలు విధించారు. నేడు మాపై జరిగినవి.. రేపు మీడియాపై జరగవచ్చు. దేశ ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ప్రజలు ఏకమై పోరాడి మోదీని గద్దె దించాలి. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ హామీలును వారి వద్దకు చేర్చాలి. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని భాజపా మమ్మల్ని నిందిస్తోంది. ప్రధాని ఇప్పటి వరకు భయపడి మణిపుర్ వెళ్లలేదు.. మా నేత రాహుల్ అక్కడికి వెళ్లారు. భయపడే నేత దేశానికి మంచి చేయలేరని ఖర్గే పేర్కొన్నారు. వర్కింగ్ కమిటీలో పూర్తిస్థాయిలో చర్చించి మేనిఫెస్టోను తయారు చేసినట్లు పార్టీ నేత, దీని కమిటీ ఛైర్మన్ పి.చిదంబరం తెలిపారు. గత పదేళ్లలో అన్ని రకాల న్యాయాలు ప్రజలకు అందలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను పనిచేయనీయకపోవడం, బలహీన వర్గాల అణచివేత కొనసాగుతోందన్నారు.

# ఇసికి ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చ

**అమరావతి:** ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ఎవరైనా తమకే నేరుగా అందించవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. సీఈవో కార్యాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 4-5 గంటల మధ్య ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తామన్నారు. రాజకీయ పార్టీలు, వ్యక్తులు, సంస్థలు ఎవరైనా నేరుగా ఫిర్యాదు చేయొచ్చన్నారు. సెలవు రోజుల్లోనూ సీఈవో కార్యాయలం అందుబాటులో ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.47.5 కోట్ల విలువైన నగదు, మద్యం, వెండి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మీనా వెల్లడించారు. 5.13 లక్షల లీటర్ల మద్యం, పెద్దమొత్తంలో డ్రగ్స్ పట్టుబడినట్లు చెప్పారు. ఎన్నికల్లో పంచేందుకు తీసుకెళ్తున్న ఉచితాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు మీనా వెల్లడించారు. సీజర్లకు సంబంధించి 4337
కేసులు, కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 247 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,681 లైసెన్స్ కలగిన ఆయుధాలను ఆయా పోలీస్ స్టేషన్లలో జమ చేశారని మీనా పేర్కొన్నారు. శుక్రవారం నాడు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు, సంఘాలు, ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు నేరుగా సచివాలయంలో అందచేయాలని తెలిపారు. కార్యాలయ పని దినాలతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా ఫిర్యాదులు ఇవ్వవచ్చని వివరించారు. సమావేశాలు, ఇతర కారణాల వల్ల తాను కార్యాలయంలో అందుబాటులో లేకపోతే అదనపు ప్రధాన ఎన్నికల అధికారులకు, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎప్పటికప్పుడు వారి దృష్టికి వచ్చిన ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదులు నేరుగా అందజేయవచ్చని అన్నారు. ప్రభుత్వ సెలవు దినాలలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తామని చెప్పారు. సెలవు దినాల్లో ఫిర్యాదు చేయాలంటే సచివాలయంలోని 5వ బ్లాకు (గ్రౌండ్ ఎ÷-లోర్ రూమ్ నెం.129) లో సంప్రదించాలని సీఈసీ ముఖేష్ కుమార్ మీనా సూచించారు.

# నేను వైఎస్ బిడ్డను.. ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

**కడప:** తాను వైయస్ఆర్ బిడ్డనని.. వైయస్ఆర్ ఎలా ప్రజలకు అందుబాటులో ఉన్నారో.. అలాగే తానూ ఉంటానని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ప్రజలకు స్పష్టం చేశారు. వైయస్ఆర్ లాగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కడప జిల్లాలో న్యాయయాత్రలో భాగంగా ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ ఎన్నికల బరిలో ఓ వైపు వైయస్ఆర్ బిడ్డ, మరోవైపు వైయస్ వివేకా హత్య కేసులో నిందితుడు ఉన్నారన్నారు. ఓ వైపు న్యాయం ఉందని తెలిపారు. ఆ వైపు అధర్మం ఉంది, నా వైపు ధర్మం ఉందని ఆమె స్పష్టం చేశారు. ఆ వైపు అధికారం, నగదు ఉంది, మరి ప్రజలు ఎవరిని గెలిపిస్తారో.. నిర్ణేతలు మీరేనంటూ ఈ సందర్భంగా ప్రజలకు ఆమె సూచించారు. కడప లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైయస్ షర్మిల బరిలో దిగారు. ఆమెకు ప్రత్యర్థిగా, వైసీపీ అభ్యర్థిగా వైయస్ అవినాష్ రెడ్డి పోటీ చేస్తున్నారు. దీంతో కడపలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. మరోవైపు వైయస్ వివేకా హత్య కేసులో వైయస్ అవినాష్ రెడ్డితోపాటు ఆయన తండ్రి వైయస్ భాస్కరరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దాంతో కడప ఎంపీగా ఎవరు గెలుస్తారనే అంశంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఇక ఇప్పటికే అంటే... 2014, 2019లో జరిగిన వరుస ఎన్నికల్లో కడప ఎంపీగా వైయస్ అవినాష్ రెడ్డి గెలుపొందారు. అయితే 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా వైయస్ షర్మిలను నిలబెట్టేందుకు ఆమె చిన్నాన్న వైయస్ వివేకానందరెడ్డి ప్రయత్నించారు. ఆ క్రమంలో ఆయన హత్యకు గురయ్యారనే ఓ ప్రచారం అయితే నడుస్తోంది.
అయితే కడప ఎంపీగా పోటీ చేయాలని వైయస్ వివేక... చనిపోయే ముందు తనకు సూచించారని చెప్పిన విషయం విధితమే. ఇక కడప ఎంపీ అభ్యర్థులుగా అటు అధికార వైసీపీ, ఇటు పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల, మరోవైపు టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డి బరిలో దిగారు. దీంతో కడప ఎంపీగా ప్రజలు ఎవరిని ఆదరిస్తారనే ఓ చర్చ అయితే జిల్లా వ్యాప్తంగా వాడి వేడిగా నడుస్తోంది.

# సామాజిక విప్లవ యోధుడు “జగ్జీవన్ రామ్”

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 5**

: భారతదేశ స్వాతంత్ర్యం కోసం, కుల రహిత సమాజ నిర్మాణానికి, సామాజిక సమానత్వానికి అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్.నర్సయ్య అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని, సంఘసంస్కర్త డాక్టర్ బాబూజగ్జీవన్ రామ్ 116వ జయంతి, జాతీయ సమతా దినోత్సవం సందర్భంగా బాబూజగ్జీవన్ రామ్ చిత్రపటానికి సత్యశోధక్



ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్.నర్సయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా నర్సయ్య మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానులుగా చేయాలన్న లక్ష్యంతో నిరంతరం పోరాడిన ఆదర్శనేత బాబూజీ అని కొనియాడారు. అవమానాలు, ఆటంకాలను విజయాలుగా మలుచుకున్న నిజమైన నాయకుడు, దేశం కోసం.. స్వాత్యంత్ర ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, సాంఘిక సమానత్వం కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కొరకు చివరి శ్వాస వరకూ తనజీవితాన్ని అంకితం చేసిన జగ్జీవన్ రామ్ జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవి, సతీష్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్ రాంకు ఘనంగా నివాళులు.

## - శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 05 :**

దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ జయంతి వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్ కమాన్ వద్ద గల జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాత అంబేడ్కర్ భవన్ లో జరిగిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. స్థానిక సంస్థల





అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి శశికళ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరై డాక్టర్ బాబూ జగ్జీవన్ రాంకు శ్రద్ధాంజలి ఘటించారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు.

## - నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 5:**

అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సామాజిక న్యాయం కోసం కృషి చేశారని కొనియాడారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పోరాటం చేశాడని తెలిపారు.



భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అధికారులు వెంకట్ రెడ్డి, దేవేందర్, నాగరాజు, కిష్టయ్య, శివకుమార్ పాల్గొన్నారు.




# కామారెడ్డిలో రైతు సత్యాగ్రహ దీక్ష.

## - పాల్గొన్న ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 5:** రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ తలపెట్టిన రైతు సత్యాగ్రహ దీక్షలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, కిసాన్ మోర్చా నాయకులు లక్ష్మారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బిబి పాటిల్, ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వడ్లకు క్వింటాలు రూ.500/- చొప్పున బోనస్ వెంటనే చెల్లించాలని, రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని, కరువుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పంట నష్టపరిహారం అందించాలన్నారు. రైతు కూలీలకు రూ.12 వేల సాయం వెంటనే జమ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

# ఎస్ఆర్ హెచ్ ఘన విజయం.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

హెూం గ్రౌండ్ ఉప్పల్ ఎస్ఆర్ హెచ్ అదరగొట్టింది. చెన్నై సూపర్ కింగ్స్ పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 166 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో ఛేదించింది. ట్రావిస్ హెడ్ 31, అభిషేక్ శర్మ 37, మార్క్రమ్ 50, షర్బాజ్ అహ్మద్ 18, క్లాసెన్ 10లి, నితీశ్ రెడ్డి 14లి రన్స్ చేశారు. మొయిన్ అలీ 2 వికెట్లు, దీపక్ చాహర్, మహీశ్ తీక్షణ చెరో వికెట్ తీశారు. కాగా ఈ సీజన్లో ఎస్ఆర్ హెచ్ కు ఇది రెండో విజయం.




# అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయాయి

**మెదక్:** తెలంగాణ ప్రజల పరిస్థితి అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి అభ్యర్థికి మద్దతుగా మెదక్ నియోజకవర్గం పాపన్నపేటలో బీఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలు నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేశారన్నారు. ఒకసారి మోసపోయారు.. మళ్లీమళ్లీ మోసపోతారా అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేస్తే కాంగ్రెస్ వాళ్లు నట్టేట ముంచారన్నారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. ఇప్పటికీ దిక్కులేదని, అప్పు కట్టాలని రైతులకు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రూ.2లక్షలు రుణమాఫీ కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వలేదని, పక్కపార్టీ వాళ్ల ఇండ్ల చుట్టు రేవంత్‌రెడ్డి తిరుగుతున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రైతులను గాలికి వదిలేసిండని.. వందరోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో చురుకు పెడితేనే కాంగ్రెస్ దారికొస్తుందన్నారు. మేం రైతుబంధు ఇస్తామంటే ఎన్నికల కమిషన్‌కు కంప్లయింట్ చేసి ఆపిందని.. రైతుబంధు దుక్కికో.. నాటుకో ఉపయోగపడే డబ్బులు పంట కోతకొచ్చినా రైతుబంధు రాలేదన్నారు. రైతుబంధు కోసం మేం ఉంచిన డబ్బులు కాంగ్రెస్ కాంట్రాక్టర్లకు ఇచ్చిందని.. కాంగ్రెస్ పాలనలో కరెంటు మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడంటే అప్పుడు నీళ్లిచ్చామని.. రెండు పంటలు పండించుకునేలా కేసీఆర్ నీళ్లిచ్చారన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే
నట్టేట ముంచారు
ఇక మరోమారు ఓటేసే
ధైర్యం ప్రజలు చేయరు
బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిని
భారీ మెజార్టీతో
గెలిపించాలి
పార్టీ నేతల సమావేశంలో
హరీష్ రావు



200 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో నీళ్లు తగ్గి కన్నీళ్లు పెరిగినయన్నారు. రూ.4వేలు పెన్షన్ ఇచ్చే వరకు రేవంత్‌కు అవ్వాతాతల కాళ్లు వత్తాలన్నారు. జనవరి నెల పెన్షన్ రేవంత్ సర్కారు ఎగ్గొట్టిందని.. అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే వాళ్ల అబద్ధాలను ఆమోదించినట్లేనన్నారు. ఆడబిడ్డల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 వేస్తామని రేవంత్ మోసం చేశారని.. కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీలు అమలు చేస్తారని చెప్పారు. కల్యాణలక్ష్మి లక్షకు తోడు తులం బంగారం ఇస్తానని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేలు ఇస్తామని రేవంత్ మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని అసెంబ్లీలో మంత్రి భట్టి అబద్ధాలాడరన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలకు రేవంత్ నియామకపత్రాలు ఇచ్చారన్నారు. చదువుకునే అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని మోసం చేశారని.. ఇన్ని మోసాలు చూసినంక కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చే వరకు వెంటాడుతామన్నారు. దుబ్బాక ప్రజలను బీజేపీ రఘునందన్‌రావు మోసం చేశారన్నారు. రఘునందన్‌రావుని దుబ్బాక ప్రజలు బండకేసి కొట్టారన్నారు. పదేళ్లలో సామాన్యులకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్, అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగాయని.. రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# వైసీపీలో రాజీనామాల పర్వం


**అనంతపురం:** అధికార వైసీపీలో నేతల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి షేక్ మహ్మద్ ఇక్బాల్ రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు ఆయన లేఖ రాశారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తన లేఖలో పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండలి చైర్మన్‌కు సైతం మహమ్మద్ ఇక్బాల్ ఫ్యాక్స్‌తో పాటు ఈ మెయిల్ పంపించారు. 2027 మార్చి వరకు తనకు ఎమ్మెల్సీ పదవి ఉన్నప్పటికీ.. వ్యక్తిగత కారణాలతోనే ఈ పదవికీ రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని శాసనమండలి చైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో టీడీపీలో ఆయన చేరనున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆయన కండువా కప్పుకొనున్నారు. గత ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా మహ్మద్ ఇక్బాల్ బరిలో దిగారు. టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. అనంతరం ఆయనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. అలాగే హిందూపురం లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆ కొద్దిరోజుల తర్వాత.. ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఆయన నుంచి పార్టీ అధినేత వైయస్ జగన్ తప్పించి.. ఆ బాధ్యతలను దీపిక అనే మహిళకు అప్పగిం చారు. దీంతో ఇక్బాల్‌ను పక్కన పెట్టినట్లు అయింది. ఆ క్రమంలో ఆయన తీవ్ర ఆవేదనకు గరయ్యారని సమాచారం. నాటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు సాధ్యమైనంత దూరంగా ఉంటూ వస్తున్నారని తెలుస్తోంది. అదీకాక.. హిందూపురం వైసీపీలో గ్రూప్ రాజకీయాలకు పెట్టింది పేరు. దీంతో ఆ గ్రూప్ రాజకీయాలకు సైతం ఇక్బాల్ తీవ్ర కలత చెందారని సమాచారం. పోలీస్ ఉన్నతాధికారి అయిన ఇక్బాల్.. పదవి విరమణ అనంతరం వైసీపీలో చేరిన సంగతి తెలిసిందే. అంతకుముందు అధికారిగా ఆయన చంద్రబాబు భద్రతాధికారిగా ఉన్నారు.

# ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయం

**భీమవరం:** రానున్న ఎన్నికల్లో తాను పోటీ చేయడం ఖాయమని నర్సాపురం సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణరాజు చెప్పారు. నర్సాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన తన పోటీ ఖాయమంటున్నారు. తాజాగా భీమవంలో మీటింగ్ పెట్టారు. జగన్ ను ఓడించే సత్తా తనకు ఉందని, జగన్ ను ఓడించే స్థాయికి తాను ఎదిగానని స్పష్టం చేశారు. తనకు కచ్చితంగా టికెట్ వస్తుందని కూటమి నుంచి పోటీ చేయడమే తన ఆశయమని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలనే దానిపై తనకు చాలా మంది సలహాలు ఇస్తున్నారని.. ఎక్కడి నుంచి బరిలోకి దిగినా తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం నుంచి తనను దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

అన్యాయాన్ని ఎదిరించినందుకు తనపై ఎన్నో తప్పుడు కేసులు మోపి, వ్యక్తిగతంగా వేధించారని రఘురాజు అన్నారు. అధికార పార్టీలోనే ఉంటూ ప్రతిపక్ష పాత్ర పోషించానని చెప్పారు. తాను ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటానని అన్నారు. వైసీపీ పాలనలో కేవలం భీమవరంలోనే కాకుండా మొత్తం రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

# క్షమాపణ కోరుకున్న దేవరకొండ



ఒకప్పుడు తమ కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక పరిస్థితుల గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ వివరించారు. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ.. ఫ్యామిలీ స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా కథ వినగానే తన తండ్రి గుర్తొచ్చారని ప్రమోషన్లలో తెలిపారు విజయ్. అందుకే మూవీలో తన రోల్ కు తండ్రి పేరైన గోవర్ధన్ అని పెట్టుకున్నట్లు చెప్పారు. తన తండ్రి ఇచ్చిన ధైర్యంతో తాను సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినట్లు కూడా వెల్లడించారు. తన కుటుంబంలో నాన్నే ఫ్యామిలీ స్టార్ అని అనేక ప్రమోషనల్ ఈవెంట్స్‌లో చెప్పిన విజయ్ దేవరకొండ.. ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "నా హీరో, నా స్టార్. ఆయన మా కోసం, ఫ్యామిలీ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. తన సంతోషాన్ని వదులుకున్నారు. ఎప్పుడైనా తప్పు చేసి ఉంటే క్షమించండి నాన్నా. నేను ఈ రోజు ఇలా ఈ స్థాయిలో ఉన్నానంటే మీరే కారణం నాన్నా" అంటూ ఎమోషనల్ అయ్యారు విజయ్. తన తండ్రి గర్వపడేలా చేసేందుకు ఎంతో కష్టపడుతున్నట్లు తెలిపారు విజయ్. చిన్న నాటి ఫోటోలను, తండ్రితో ఉన్న మెమోరీస్ ను వీడియో రూపంలో సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే ఆ వీడియోలో యంగ్‌గా ఉన్న గోవర్ధన్ రావును చూస్తుంటే అచ్చం విజయ్ దేవరకొండలానే కనిపిస్తున్నారు. 90స్ లో గోవర్ధన్, ఇప్పుడు విజయ్ ఒకేలా ఉన్నారని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. ఒకప్పుడు తమ కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక పరిస్థితుల గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ వివరించారు. రోజు మొత్తంలో ప్రతీ ఖర్చును కూడా తన తండ్రి గోవర్ధన్ డైరీల్లో రాసేవారని తెలిపారు. ఇంట్లో ఏ డైరీ ఓపెన్ చేసి చూసినా ఇవే ఉండేవని చెప్పారు. తండ్రి వల్లే తనకు బాగా ధైర్యం వచ్చిందని, ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో సినీ ఇండస్ట్రీలోకి నమ్మకంతో వచ్చానని చెప్పారు. ఇక ఫ్యామిలీ స్టార్ మూవీలో గోవర్ధన్ పాత్రలో విజయ్ దేవరకొండ, ఇందూ పాత్రలో హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటించారు. ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని డైరెక్టర్ పరశురామ్ తెరకెక్కించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత దిల్? రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ గోపీసుందర్ సంగీతాన్ని అందించారు.

# ఏదో ఒకటి తేల్చండి సారు..?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి మూవీ రిలీజ్ విషయం పైనే చర్చ గట్టిగానే నడుస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి మూవీ రిలీజ్ విషయం పైనే చర్చ గట్టిగానే నడుస్తోంది. మే9వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ ఎప్పుడో చెప్పినా.. ఎన్నికల వలన వాయిదా తప్పదని అందరికి ముందే క్లారిటీ వచ్చేసింది. ఇక ప్రస్తుతం రిలీజ్ డేట్స్ పై ఎన్ని గాసిప్స్ వస్తున్నా కూడా పెద్దగా క్లారిటీ ఇవ్వడం లేదు. అలా అని కొత్త డేట్ కూడా ప్రకటించడం లేదు. దీంతో కల్కి మేకర్స్ పై ఫ్యాన్స్ అయితే కాస్త గుర్రుగానే ఉన్నారు. ఏదో ఒక అప్డేట్ ఇవ్వండని సోషల్ మీడియాలో రిక్వెస్ట్ పెడుతున్నారు. ఒకవేళ రిలీజ్ వాయిదా నిజమే అయితే కొత్త తేదీ అయినా ప్రకటించాలని కోరుతున్నారు. కానీ మూవీ యూనిట్ మాత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా గడుపుతోంది. ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్లు సినీ వర్గాల్లో టాక్ జోరుగా వినిపిస్తోంది. జూన్ మొదటి లేదా రెండో వారంలో కల్కి మూవీని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ లో అనుకూలంగా ఉండే అంశంతో పాటు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని విడుదల తేదీని లాక్ చేసినట్లు సమాచారం. జూన్ ఫస్ట్ వీక్ అనంతరం ఎన్నికల వేడి తగ్గడంతోపాటు విద్యార్థులకు ఇంకా కొన్ని సెలవులు ఉండటం వల్ల ఓపెనింగ్స్ విషయంలో పెద్ద టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. పాజిటివ్ టాక్ వస్తే తిరుగేలేదు. అయితే ఈ సినిమాను వాయిదా వేసి అక్టోబర్ లేదా డిసెంబర్ లో రిలీజ్ చేయాలని కూడా మొదట మేకర్స్ భావించారట. కానీ ఇటీవల అశ్వినీ దత్ తో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లతో సమావేశమయ్యా రు! వారంతా మే చివర్లో లేదా జూన్ లో రిలీజ్ చేయమని సలహా ఇచ్చారని టాక్. వాటిని పరిగణనలోకి తీసుకుని కొత్త డేట్ ను నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే మేకర్స్.. అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇవ్వనున్నారు. మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను రూ.600 కోట్ల బడ్జెట్ తో నిర్మాత అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు పనిచేసిన వారితో వీఎఫ్ ఎక్స్ వర్క్ చేయిస్తున్నారు. దగ్గరుండి నాగ్ అశ్విన్ అన్ని పనులు చూసుకుంటున్నారు. దీపికా పదుకొణె హీరోయిన్ గా నటిస్తుండగా.. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ, రాజేంద్ర ప్రసాద్, పశుపతి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. మరి చూడాలి ఈ సినిమా ఎలా ఉంటుందో!





# ఒకేసారి 50 కోట్లు!

ఇక డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై చేస్తున్న రెండు చిత్రాలకు గాను నాని రూ.50 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నారట. టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. గతేడాది దసరా, హాయ్ నాన్న మూవీలతో వచ్చి రెండు హిట్లను తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు చేతి నిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. అంటే సుందరానికి మూవీని తెరకెక్కించిన దర్శకుడు వివేక్ ఆత్రేయతో సరిపోదా శనివారం మూవీ చేస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. 2024 ఆగస్టు 29వ తేదీన విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయింది. నాని బర్త్ డే సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్ అంచనాలు పెంచేశాయి. దసరా మూవీ తర్వాత మరోసారి మాస్ ఎలివేషన్లలో కనిపించబోతున్నారు నాని. ఎస్ జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను ఆర్ఆర్ఆర్ నిర్మాత డీవీవీ దానయ్య నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే డీవీవీ దానయ్య బ్యానర్‌లో మరో సినిమాకు కూడా నాని సంతకం చేశారు. ఆ చిత్రానికి సాహో ఫేమ్ సుజిత్ దర్శకత్వం వహించనున్నారు. నాని బర్త్ డే రోజే ఈ మూవీ అనౌన్స్ చేసి.. గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. పూర్తిగా కార్టూన్స్ తో ఉన్న వీడియో ప్రేక్షకులను తెగ ఆకట్టుకుంది. ఈ సినిమా షూటింగ్ మరికొద్ది నెలల్లో ప్రారంభం కానుంది. వచ్చే ఏడాదే ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై చేస్తున్న రెండు చిత్రాలకు గాను నాని రూ.50 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నారట. ఒక్కో సినిమాకు నాని రూ.25 కోట్లు




అడగ్గా.. దానయ్య ఓకే చెప్పేశారని సినీ వర్గాల్లో టాక్. దీంతో నేచురల్ స్టార్ కు దానయ్య సాలిడ్ రెమ్యునరేషన్ ఇస్తున్నారన్నమాట. గత ఏడాది ముందు వరకు 20 కోట్ల వరకు వచ్చిన నాని లెక్క ఇప్పుడు ఇంకాస్త పెరిగినట్లు అర్థమవుతుంది. నాని ఎలాంటి సినిమా చేసిన నాన్ థియేట్రికల్ గానే మంచి రేట్లు వస్తుంటాయి. అక్కడే నిర్మాత సగం సేఫ్ అవుతారు. ఇక నాని డిమాండ్ కు తగ్గట్టుగానే దానయ్య అతనికి 50 కోట్ల చెక్ ఇచ్చినట్లు టాక్. ఇటీవల నాని.. దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో మరో సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. ఎస్ ఎల్వీ సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చేకూరి నిర్మిస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనుండగా.. ఈ మూవీ కూడా వచ్చే ఏడాది రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు నాని.. బలగం వేణుతో కూడా సినిమా చేయనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. మరి నాని కొత్త సినిమాలు ఎలా ఉంటాయో చూడాలి.

# కళ్లతోనే నవ్వడమంటే ఇదేనేమో..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న.. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. నేషనల్ క్రష్ రష్మిక మందన్న.. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది యానిమల్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ బ్యూటీ. తన యాక్టింగ్ తో విమర్శకుల ప్రశంసలు కూడా దక్కించుకుంది. పలువురు సినీ ప్రముఖులు కూడా ఆమె నటనను మెచ్చుకున్నారు. ఈ ఏడాది లో బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ తో అలరించనుంది రష్మిక. నేడు ఆమె బర్త్ డే కావడంతో ఆయా సినిమాల మేకర్స్ అప్డేట్స్ ఇస్తున్నారు. నటుడు, డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక.. గర్ల్ ఫ్రెండ్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దసరా ఫేమ్ దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్.. హీరో ఇంట్రడక్షన్ వీడియో రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. అయితే ఈ మూవీ టీజర్.. నేడు రిలీజ్ చేస్తామని రాహుల్ రవీంద్రన్ ఇప్పటికే ప్రకటించారు. కానీ రష్మిక ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. "ఆమె కన్నా ముందు ఆమె కళ్లు నవ్వుతాయి. ఆమె మాట్లాడని మాటలు కూడా మాట్లాడతాయి. గర్ల్ ఫ్రెండ్ ను పరిచయం చేస్తున్నాం. నేషనల్ క్రష్ కు హ్యాపీ బర్త్ డే" అంటూ మేకర్స్ పోస్ట్ చేశారు. పోస్టర్ లో రష్మిక ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టింది. 90 డ్రెస్సింగ్ స్టైల్ లో ఆకట్టుకుంటుంది. ఆమె చేతికి ఉన్న వాచ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ప్రస్తుతం రష్మిక ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. అందాల రాక్షసి మూవీతో టాలీవుడ్ లో మంచి గుర్తింపు సంపాదించుకున్న రాహుల్ రవీంద్రన్.. గర్ల్ ఫ్రెండ్ సినిమాను గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నారు. చి ల సౌతో డైరెక్టర్ గా మారిన ఆయన.. ఐదేళ్ల తర్వాత మళ్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. 2024 లో ప్రేక్షకుల ముందుకు రానుందని సినీ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలేని ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అల్లు అరవింద్ ఇన్వాల్వ్మెంట్ ఉండడంతో మూవీపై మంచి అంచనాలు నెలకొన్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహీద్ బాణీలు కడుతున్నారు. కృష్ణన్ వసంత సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళ భాషల్లో రిలీజ్ అవ్వనున్న ఈ సినిమా.. ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి.

# చైతు మాటతో కన్ఫ్యూజన్ తీరినట్లే..

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య.. ప్రస్తుతం తండేల్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య.. ప్రస్తుతం తండేల్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. చందూ మొండేటి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుండగా.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎప్పటికప్పుడు షూటింగ్ అప్డేట్స్ ఇస్తూ.. సినిమాపై మంచి హైప్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. ఉత్తరాంధ్ర కు చెందిన కొందరు మత్స్యకారుల నిజ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. అయితే ఈ మూవీ కన్నా ముందు దూత వెబ్ సిరీస్ తో సూపర్ హిట్ కొట్టారు నాగచైతన్య. విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన ఈ హారర్ థ్రిల్లర్ వెబ్ సిరీస్.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అయ్యి అదిరిపోయే రెస్పాన్స్ అందుకుంది. అనేక రికార్డులు సృష్టించింది. కొన్ని నెలలపాటు ట్రెండింగ్ నెం.1లో నిలిచింది. దీంతో ఆడియన్స్.. ఈ సిరీస్ సీక్వెల్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దూత-2 రానుందని ఆ మధ్య వార్తలు కూడా వచ్చాయి. కానీ ఇటీవల జరిగిన అమెజాన్ ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో దూత-2 గురించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఫ్యాన్స్ అంతా నిరాశ వ్యక్తం చేశారు. తాజాగా నాగచైతన్య దూత-2 గురించి హింట్ ఇచ్చారు. ఆ సిరీస్ టీమ్ తో దిగిన పిక్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "దూత విజయం పిలుపు! ఇది చాలా సంతృప్తికరంగా ఉంది! త్వరలో మరిన్నిటి కోసం ఎదురు చూస్తున్నాను" అని ట్వీట్ చేశారు. దీంతో త్వరలోనే దూత-2 అధికారిక అప్డేట్ రానుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సిరీస్ లో పార్వతి, ప్రాచీ దేశాయ్, ప్రియా భవానీ శంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. విక్రమ్ కుమార్ తన మార్క్ ను చూపించారు. చైతూతో తీసిన థాంక్యూ మూవీ ఫ్లాప్ అయినా.. ఈ సిరీస్ తో మాత్రం అందరి దృష్టిని ఆకర్షించారు డైరెక్టర్ విక్రమ్. ఇంతకముందు ఆయన అక్కినేని కుటుంబంతో మనం మూవీ తీసిన విషయం తెలిసిందే. ఇక దూతలో నాగచైతన్య ఓ పత్రిక ఎడిటర్ సాగర్ వర్మగా కనిపించారు. అనుకోని పరిస్థితుల్లో భవిష్యత్తులో జరగబోయే హత్యల వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత మర్డర్లకు సాక్షిగా మారుతారు. దీంతో ఆయన ఫ్యామిలీ ఇబ్బందుల్లో పడుతుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది సిరీస్. ఇక దూత సీజన్ 2లో ఎలాంటి థ్రిల్లింగ్ సీన్స్ ఉంటాయో, అఫీషియల్ అప్డేట్ ఎప్పుడు వస్తుందోనని ప్రేక్షకులు వెయిట్ చేస్తున్నారు.



# ధోని బొమ్మ చూపించి మరి..!



బఫరింగ్ సుఫర్ చేయొచ్చు. కానీ ఒక్కసారి లోడ్ అయితే మాత్రం ఎక్స్ ప్లోడ్ అవుతుంది లోడింగ్ అని పెట్టాడు అడివి శేష్. కొన్నిసార్లు రావడం లేట్ అవ్వొచ్చు కానీ రావడం మాత్రం పక్కా అని పవన్ కళ్యాణ్ డైలాగ్ ఉంది కదా ఇప్పుడు దాన్ని మోడ్రనైజ్ చేస్తూ యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ అడివి శేష్ తన జీ 2 గురించి చిన్న హింట్ ఇచ్చాడు. ప్రస్తుతం డెకాయిట్, గూడచారి 2 సినిమాల్లో నటిస్తున్న అడివి శేష్ ఆ సినిమాల అప్డేట్ కోసం ఆడియన్స్ ఆసక్తిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తించాడు. అందుకే జి2 గురించి ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చాడు. బఫరింగ్ సుఫర్ చేయొచ్చు. కానీ ఒక్కసారి లోడ్ అయితే మాత్రం ఎక్స్ ప్లోడ్ అవుతుంది లోడింగ్ అని పెట్టాడు అడివి శేష్. అయితే ఈ కామెంట్ ఒక్కటి పెడితే మ్యాటర్ ఎలా కన్వే అవుతుంది. అందుకే ఎంఎస్ ధోని ఫోటో ఒకటి జత చేశాడు. ఆఫ్టర్ 303 డేస్ ఎం.ఎస్ ధోని మరో విధ్వంసకరమైన ఇన్నింగ్స్ ఆడాడు. ధోని ఫ్యాన్స్ అంతా కూడా ఎంజాయ్ చేసేలా ఆ మ్యాచ్ నడిచింది. అయితే ఆ ఫోటో పెట్టి అడివి శేష్ జీ 2 లోడింగ్ అని పెట్టాడు. 2018లో వచ్చిన గూఢచారి సినిమా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ప్రస్తుతం గూఢచారి 2 సెట్స్ మీద ఉంది. జి 2 సినిమాను విజయ్ కుమార్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ను ధోని ఇన్నింగ్స్ తో పోల్చాడు అంటే అడివి శేష్ ప్లాన్ నెక్స్ట్ లెవెల్ లోనే ఉందని చెప్పొచ్చు. ఈ సినిమాతో పాటుగా డెకాయిట్ తో వస్తున్నాడు అడివి శేష్. డెకాయిట్ సినిమా లో శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తుంది. ఆమధ్య వచ్చిన డెకాయిట్ టీజర్ కూడా ఇంప్రెస్ చేసింది. ఏది ఏమైనా తన మార్క్ ప్రత్యేకమైన సినిమాలతో అడివి శేష్ అదరగొట్టేస్తున్నాడు. రాబోతున్న గూఢచారి 2, డెకాయిట్ సినిమాలు కూడా ధోని ఇన్నింగ్స్ లానే దుమ్ము దులిపేస్తాడేమో చూడాలి. అడివి శేష్ ఇంత కాన్ఫిడెంట్ గా చెప్పాడు అంటే సినిమాలు అనుకున్న దాని కన్నా బెటర్ గా వస్తున్నాయని చెప్పొచ్చు. అడివి శేష్ సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త కథలతో కొత్త ప్రయోగాలు చేస్తున్న అడివి శేష్ రాబోయే సినిమాలతో పెద్ద ప్లానింగ్ లో ఉన్నాడని తెలుస్తుంది.

# 'రామాయణం' కోసం ఆస్కార్ విన్నర్లు..



వెండితెరపై రామాయణ, మహాభారతాలు ఎన్ని సార్లు చూసినా, ఎవరు ఎన్ని రకాలుగా తీసినా కూడా ఆడియెన్స్ మాత్రం ఎప్పుడూ వాటిని చూసేందుకు రెడీగా ఉంటారు. నితిష్ తివారి ఇప్పుడు రామాయణం మీద ఫుల్ ఫోకస్ పెట్టినట్టుగా కనిపిస్తోంది. ఈ మూవీ మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా ప్రారంభం అయినట్టుగా తెలుస్తోంది. మహాభారతం సినిమాను తెరపైకి తీసుకు రావాలని రాజమౌళి అనుకున్న సంగతి తెలిసిందే. కానీ అది ఇప్పట్లో సాధ్యం కాదని ఆ దర్శక ధీరుడికి తెలుసు. ఇక రామాయణం మూవీని ఇప్పటికే చాలా మంది చాలా రకాలుగా తీశారు. గత ఏడాది ఆదిపురుష్ అంటూ ఓం రౌత్ తన పైత్యాన్ని ప్రదర్శించిన సంగతి తెలిసిందే. అల్లు అరవింద్ బాలీవుడ్ ప్రొడక్షన్స్‌తో కలిసి రామాయణం తీయాలని అనుకున్నారు. ఇక నితీష్ తివారి మాత్రం ఈ రామాయణం ప్రాజెక్ట్ మీద ఎప్పటి నుంచో ఫోకస్ పెట్టి ఉన్న సంగతి తెలిసిందే. నితీష్ తివారి తీయనున్న ఈ రామాయణం మీద ఎప్పుడూ ఏదో ఒక రూమర్ వస్తూనే ఉంటుంది. రణ్ బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా కనిపిస్తారని వార్తలు వస్తుంటాయి. ఈ మూవీ తెలుగు వర్షన్‌కు త్రివిక్రమ్ మాటలు అందిస్తాడనే రూమర్ కూడా వచ్చింది. ఈ మూవీ కోసం ఇంటర్నేషనల్ మ్యూజిక్ డైరెక్టర్‌ను పట్టుకొస్తున్నారట. ఆస్కార్ అవార్డులు గెలిచిన ఏ ఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్‌లు రామాయణం కోసం పని చేస్తారట. ది లయన్ కింగ్, గ్లాడియేటర్, పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్, ది డార్క్ నైట్ ట్రయాలజీ, ఇన్‌సెప్షన్, మ్యాన్ ఆఫ్ స్టీల్, ఇంటర్‌స్టెల్లార్, డంకిర్క్, నో టైమ్ టు డై వంటి ఎన్నో కల్ట్ సినిమాలకు హన్స్ జిమ్మర్ పని చేశారు. ఇక ఆయన ఈ రామాయణంతో ఇండియన్ మూవీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారట. అయితే ఇప్పుడు జిమ్మెర్‌తో చివరి దశ చర్చలు జరుగుతున్నాయని సమాచారం.

# రజినీ-లోకేశ్ సినిమాలో బాలీవుడ్ స్టార్ ఫిక్స్..

సూపర్ స్టార్ రజినీకాంత్-లోకేశ్ కనగరాజ్ కాంబోలో సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్ కోసం బాలీవుడ్ స్టార్ హీరోను తీసుకున్నట్లు టాక్. అది ఎవరంటే? సూపర్ స్టార్ రజినీకాంత్- దర్శకుడు లోకేష్ కనగరాజ్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కి సోషల్ మీడియాలో భారీ రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ మూవీ టైటిల్ రివీల్ కూడా ఈ నెలలోనే ఉన్నట్లు ఇప్పటికే లోకేష్ ప్రకటించారు. అయితే తాజాగా ఈ సినిమా క్యాస్టింగ్‌పై సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వస్తున్నాయి. బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రజినీ మాఫియా డాన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. షారుక్ నో.. మరి! తాజా సమాచారం ప్రకారం.. 'తలైవర్ 171'లో కింగ్ ఖాన్ షారుక్‌కి లోకేష్ కనగరాజ్ ఒక ముఖ్యమైన పాత్రను ఆఫర్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ ఆఫర్‌ను షారుక్ సున్నితంగా తిరస్కరించినట్లు టాక్. స్క్రిప్ట్, తన రోల్ నచ్చినప్పటికీ ఫుల్ లెంగ్త్ పాత్రల్లోనే నటించాలని అనుకుంటున్నట్లు షారుక్ చెప్పారట. దీంతో ఈ పాత్ర కోసం మరో స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌ని సంప్రదించారట లోకేష్. రోల్ బాగా నచ్చడంతో సినిమాకి సైన్ చేసేందుకు రణవీర్ ఒప్పుకున్నారట. త్వరలోనే దీనిపై అఫీషియల్ ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే హిందీలో తలైవర్ 171కి మంచి బజ్ వచ్చే అవకాశం ఉంది. సన్ పిక్చర్స్ ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఇక ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తలైవర్ 171పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. "ప్రస్తుతం తలైవర్ 171 (వర్కింగ్ టైటిల్) సినిమా గురించి మాత్రమే ఆలోచిస్తున్నాను. అందుకే ఎవరికీ అందుబాటులో లేను. నాతో మాట్లాడేందుకు చాలా మంది నాకు ఫోన్లు చేస్తున్నారు. కానీ వారందరికీ చెప్పే విషయం ఏంటంటే నేను 2-3 నెలలుగా అసలు ఫోన్‌యే వాడటం లేదు. కేవలం రజినీ సార్‌తో మాత్రమే టచ్‌లో ఉన్నాను. ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ కోసం నాకు మరో 2-3 నెలల సమయం పడుతుంది." అంటూ లోకేష్ చెప్పారు.

ఇటీవలి కాలంలో సౌత్ సినిమాల్లో పలు ముఖ్యమైన పాత్రలను బాలీవుడ్ హీరోలకి ఇస్తున్నారు డైరెక్టర్లు. కేజీఎఫ్, లియో, డబుల్ ఇస్మార్ట్ సినిమాల్లో బాలీవుడ్ హీరో సంజయ్ దత్ విలన్ రోల్ పోషించిన సంగతి తెలిసిందే. అలాగే యానిమల్, కంగువా సహా పలు సౌత్ ప్రాజెక్టుల్లో బాబీ డియోల్‌కి సూపర్ రోల్స్ దక్కాయి. దీని వల్ల బాలీవుడ్‌లో కూడా సౌత్ సినిమాలకి మంచి క్రేజ్ ఏర్పడుతోంది. కలెక్షన్ల పరంగా కూడా బాలీవుడ్‌లో సౌత్ సినిమాలు సత్తా చాటుతున్నాయి. దీంతో బాలీవుడ్ స్టార్లు కూడా సౌత్ సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.